నిప్పు..ముప్పు



» ధర్మవరం రూరల్ సమీపంలో రైతు శ్రీరాములుకు చెందిన జామ తోటకు మూడు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. 350 జామ చెట్లు మంటల్లో కాలిపోయాయి.

» రేగాటిపల్లి సమీపంలో ఇటీవల మందుబాబులు సిగరెట్ తాగి ఆర్పకుండా పడేసిన ముక్క వల్ల అది ఎండు గడ్డికి అంటుకొని పక్కనే ఉన్న నరేంద్ర గడ్డి వామికి మంటలు వ్యాపించాయి.

» తాజాగా కనగానపల్లి మండలం మామిళ్లపల్లి రైతు మాల నాగప్ప చీనీ తోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఆ మంటలు కాస్తా పక్కనే ఉన్న అనప పంటనూ తాకాయి.

- ఎండుగడ్డి.. నిప్పు పడితే బుగ్గి
- పండ్లతోటల రైతులూ తస్మాత్ జాగ్రత్త
- ఆకతాయిల చేష్టలతో రైతులకు తీరని నష్టం



రేగాటిపల్లి సమీపంలో రోడ్డు పక్కన సిగరెట్ తాగి ఆర్పకుండా పడేయడంతో చీనీ తోట వైపు వెళ్తున్న మంటలు

ధర్మవరం రూరల్: వేసవి సీజన్ ఆరంభమైంది. పచ్చిక ఎండి పోతోంది. ఇలాంటి సమయంలో ఆకతాయిలు, తాగుబోతులు ఎండు గడ్డికి నిప్పు పెడుతున్నారు. ఆ నిప్పు సమీపంలోని పండ్ల తోటలకు వ్యాపించడంతో పంటలు బుగ్గిపాలవుతున్నాయి. ధర్మవరం వ్యవసాయ డివిజన్‌లో సుమారు 30 వేల ఎకరాలు అటవీ విస్తీర్ణం ఉంది. ముఖ్యంగా ధర్మవరం మండలం దర్శనమల, నడిమగడ్డపల్లి, బుడ్డారెడ్డిపల్లి, నేలకోట, మల్లాకాలువ, వెంకటతిమ్మాపురం, కనంపల్లి తదితర గ్రామాలు కొండ ప్రాంతాలలో ఉన్నాయి. ఎక్కడో ఒక చోట ఎండు గడ్డికి నిప్పు పెడుతుండడంతో రోజుల తరబడి కొండ ప్రాంతాలు కాలుతూ బుగ్గి పాలవుతున్నాయి.

కాలిపోతున్న వన్యప్రాణులు

ధర్మవరం, కనగానపల్లి మండలాల్లో అడవి పందులు, జింకలు, నెమళ్లు, ఆలువలు, కుందేళ్లు ఎక్కువగా ఉన్నాయి. ఆకతాయిలు నిప్పు పెడుతుండడంతో రోజుల తరబడి అటవీ సంపద కాలిపోవడమే కాకుండా అటవీ జంతువులు మంటల్లో కాలిపోతున్నాయని రైతులు అంటున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వేసవి సమీపించడంతో పండ్ల తోటల రైతులు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా పొలం గట్ల వెంబడి ఎండు గడ్డి తొలగించుకోవాలి. పండ్ల తోటల సమీపంలో మద్యం సేవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వేసవి పూర్తయ్యే వరకు రైతులు అప్రమత్తంగా ఉండాలి.

తాగుబోతులతో నష్టాలు

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మద్యం అమ్మకాలు ఎక్కువయ్యాయి. మద్యం ప్రియులు ఎక్కడ పడితే అక్కడ మద్యం తాగుతున్నారు. ముఖ్యంగా పొలాల సమీపంలోనే మద్యం తాగుతూ.. సిగరెట్/ బీడీ తాగి ఆర్పకుండా నిర్లక్ష్యంగా పడేస్తుండటంతో ఎండు గడ్డి అంటుకుంటోంది. అది కాస్తా కాలుతూ వచ్చి సమీపంలోని తోటలకు మంటలు వ్యాపిస్తున్నాయి. ఈ మంటల్లో చీనీ, బొప్పాయి, మామిడి, అరటి, జామ తదితర తోటలు కాలిపోతున్నాయి. దీనికి తోడు పొలాల్లో ఉన్న డ్రిప్పు, ప్లాస్టిక్ పైపులు, వ్యవసాయ పరికరాలు కాలిపోతున్నాయి. రైతులు అపారంగా నష్టపోతున్నారు.

నిప్పు పెడితే కఠిన చర్యలు



అడవులకు నిప్పు పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజల సహకారంతో అటవీ సంపదను కాపాడుతాం. గ్రామాల్లో ఆకతాయిలు, గొర్రెల కాపరులు అడవులకు నిప్పు పెడుతుంటారు. అలాంటి వారిపై నిఘా ఉంచి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. అడవులకు నిప్పు పెట్టకుండా కాపాడుకునేందుకు గ్రామాల్లో అటవీశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నాం.

ఎస్.యామినీ సరస్వతి, ఎఫ్ఆర్ఓ, బుక్కపట్నం



భైరవుని గుడి సమీపంలో మద్యం ప్రియులు తాగి పడేసిన సిగరెట్ అంటుకుని మంటల్లో కాలిపోతున్న గడ్డివామి



చంద్రాశ్వర్లలో కాలిపోయిన జామ తోటను చూపుతున్న బాధిత రైతు

క్లుప్తంగా

డ్యూటీ చార్ట్ వేయండి



డీఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

కదిరి అర్బన్: సీనియారిటీ జాబితాకు అనుగుణంగా కండక్టర్లు, డ్రైవర్లకు డ్యూటీ చార్ట్ వేయాలని ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) నాయకులు కోరారు. ఈ మేరకు ఆర్టీసీ డిపోలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మంగళవారం డీఎం మైనోద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. 1-19 సర్క్యులర్ అమలు చేయాలన్నారు. టిమ్ చార్జింగ్ నిమిత్తం మదనపల్లి పాయింట్‌లో చార్జింగ్ పాయింట్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈయూ డిపో ప్రెసిడెంట్ దివాకర్, సెక్రటరీ శంకరప్ప, ట్రెజరర్ హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు



దిగుబడి అంచనా వేస్తున్న అధికారులు

బత్తలపల్లి: ఖరీఫ్ సీజన్‌లో వర్షాధార పంటగా సాగు చేసిన కందిలో దిగుబడి అంచనా కోసం మంగళవారం రాఘవంపల్లిలో ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ పర్యవేక్షణలో వీహెచ్‌ఏ సత్యనారాయణ పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. 1,210 గ్రాముల దిగుబడి వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్సూరెన్స్ మండల కోఆర్డినేటర్ శామ్యూల్, మహేష్ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగా సాధన చేస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం అలవడుతుందని ఆధ్యాత్మిక యోగా కేంద్ర గౌరవ అధ్యక్షుడు గుర్రం వేణుగోపాల్, అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ఆర్గనైజర్ నరసింహులు తెలిపారు. రథ సప్తమి సందర్భంగా మంగళవారం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో 108 సూర్య నమస్కారాలు చేశారు. సూర్య భగవానుడి ఆవశ్యకత తెలిపి ఆరోగ్యంగా ఉండాలంటే యోగా తప్పనిసరి చేయాలన్నారు. రోజూ ఒక గంట సమయాన్ని యోగా కోసం వినియోగిస్తే అందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు.

- కొత్తపేట శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో సేవా భారత్ ఆధ్వర్యంలో సూర్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. యోగా సాధకులు తిరుమలేసు, ఈశ్వరయ్య సూర్యుడి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం 108 సూర్య నమస్కారాలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఖండ కార్యవహ అన్నం అరవింద్, ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రముఖ్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ



ప్రిన్సిపాల్ దామోదర్

కదిరి అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా సీనియర్ అధ్యాపకులు దామోదర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న హరీంద్ర ప్రసాద్ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం: స్వయం ఉపాధి సబ్సిడీ రుణాలకు అర్హులు ఈ నెల ఏడో తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ బీసీ (96 యూనిట్లు), ఈబీసీ(4), కమ్మ (2), రెడ్డి (1), ఆర్యవైశ్య (1), బ్రాహ్మణ (1యూనిట్) కులస్తులకు మొత్తం 105 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. అలాగే బీసీ కార్పొరేషన్ ద్వారా రెండు, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా ఒక్కొక్కటి చొప్పున జనరిక్ మెడికల్ షాపులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. దరఖాస్తుదారుల వయసు బీసీ, ఈబీసీలకు 21 నుంచి 60 సంవత్సరాలు మధ్య ఉండాలని, బీపీఎల్ కుటుంబాలకు చెందిన వారై ఉండాలని తెలిపారు. జనరిక్ మెడికల్ షాపులకు దరఖాస్తు చేసుకోవడానికి బీ ఫార్మసీ, డీ ఫార్మసీ చేసినవారు అర్హులన్నారు.

ముదిగుబ్బ: స్వయం ఉపాధి కింద రెడ్డి, బలిజ, కమ్మ, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా ముదిగుబ్బ మండలానికి 48 యూనిట్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ దివాకర్ తెలిపారు.

కంది పంట దగ్ధం

కదిరి అర్బన్: రాందాస్‌నాయక్ తండాలో రైతు లాలూనాయక్ ఒకటిన్నర ఎకరా విస్తీర్ణంలో సాగు చేసిన కంది పంట మంగళవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. పంట కోసి పొలంలోనే కుప్పలు వేశారు. పక్క పొలం రైతు చెత్తకు నిప్పు పెట్టడంతో మంటలు కంది పంటకు వ్యాపించాయి. దీంతో కంది పంటతో పాటు స్టార్టర్ కాలిపోయిందని లాలూనాయక్ తెలిపాడు.

ప్రజారోగ్యమే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

గాండ్లపెంట: ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా పనిచేయాలని ఆశాకార్యకర్తలకు వైద్యాధికారులు సూచించారు. మంగళవారం గాండ్లపెంట పీహెచ్‌సీలో ఆశాడే కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారులు ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సాంక్రమిక, అసాంక్రమిక వ్యాధులపై చేపట్టిన సర్వే వివరాలతో పాటు క్షేత్రస్థాయిలో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు చేపట్టిన వ్యాక్సినేషన్, అంగన్‌వాడీ చిన్నారులు, పాఠశాల విద్యార్థుల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు డీపీహెచ్ఎన్ వీరమ్మ, ఎస్ఓ కళాధర్ ఐహెచ్ఐపీ సుబ్బయ్య, వైద్యాధికారులు మహేశ్వర మారుతి, బాబాఫక్రుద్దీన్, హెచ్ఈ విజయ్‌కుమార్, ఆరోగ్య పర్యవేక్షకులు ఉపేంద్రారెడ్డి, సరస్వతి, ఏఎన్‌ఎం,ఎంఎల్‌హెచ్‌పి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడిమర్రి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఏఎన్‌ఎంలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలతో వైద్యాధికారి గోవర్ధన్ నాయుడు సమావేశం నిర్వహించారు. ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ నారాయణమ్మ, సూపర్‌వైజర్ రామ్‌కుమార్, పీహెచ్ఎన్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

సర్వే పక్కాగా నిర్వహించాలి

నల్లచెరువు: ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది కలిసి గ్రామాల్లో నిర్వహిస్తున్న ఎన్సీడీ, కుష్టు రోగుల గుర్తింపు సర్వే పక్కాగా నిర్వహించాలని జిల్లా వైద్య అధికారి బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మండల వైద్యాధి కారి డాక్టర్ కల్పన రెడ్డి ఆధ్వర్యంలో ఆశా డే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాఫక్రుద్దీన్ మాట్లాడారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రామచంద్రారెడ్డి, సూపర్‌వైజర్లు సుధాకర్, రెడ్డెమ్మ, ఫార్మసిస్ట్ చిన్నయ్యశెట్టి, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీగా ముందుకు వెళ్దాం

- పాత్రికేయులతో డీఎస్పీ హేమంత్‌కుమార్



డీఎస్పీ హేమంత్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ధర్మవరం: పాత్రికేయులు, పోలీసులు ఫ్రెండ్లీగా ముందుకు వెళ్తూ అందరి సహకారంతో ధర్మవరం సబ్‌డివిజన్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని డీఎస్పీ హేమంత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఎన్‌జీఓ హోమ్‌లో ధర్మవరం సబ్‌డివిజన్ ఏపీయూడబ్ల్యూజే కమిటీ సభ్యులు నూతన డీఎస్పీతో పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. డీఎస్పీని సన్మానించి, మొమెంటో అందజేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ పాత్రికేయులు ఐకమత్యంగా కలిసి మెలిసి ఉండాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా సబ్ డివిజన్‌లో ఏవైనా సమస్యలు వస్తే తన దృష్టికి తీసుకువచ్చి సహకరించాలని కోరారు. బత్తలపల్లి మండల పాత్రికేయుల సంఘం ఆధ్వర్యంలో డివిజన్‌లోని ప్రతి సభ్యునికి క్యాప్ (టోపీ)లను అందజేశారు. ఐడీ కార్డులను డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ జీవీ నారాయణ, డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జానపాటి మోహన్, జాంపుల అజయ్‌నాయుడు, గౌరవాధ్యక్షులు విజయ్‌భాస్కర్ రెడ్డి, జిల్లా నాయకులు రాంప్రసాద్, మదనాపు రామాంజనేయులు, పూల మూర్తిప్రసాద్, పామాల నాగేంద్ర, బిల్లే జయశంకర్, గోల్డ్ గురుప్రసాద్, ఆర్.రామకృష్ణ, భావిశెట్టి, పెండేకంటి ఆంజనేయులు, వెంకటేష్, మదనాపు శ్రీనివాసులు, నెట్టెం మల్లికార్జున, మంజుల రాధాకృష్ణ, సాకే శ్రీనివాసులు, కప్పల హరికృష్ణ, మదనాపు రాజశేఖర్, మాతంగి రామాంజనేయులు, వెంకట చౌదరి, మహదేవ్‌రెడ్డి, మురళి, వీరనారప్పతో పాటు ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ, చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాలకు చెందిన పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

నియమాలు పాటిద్దాం.. ప్రమాదాలు నివారిద్దాం



ఆటో డ్రైవర్లతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఎంవీఐ

గాండ్లపెంట: ప్రతి ఒక్కరూ రహదారి నియమాలు పాటించి.. ప్రమాదాలు నివారించాలని కదిరి ఎంవీఐ వరప్రసాద్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆటో డ్రైవర్లతో ర్యాలీ, ఉన్నత పాఠశాల, వైఎస్సార్ కూడలిలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. మత్తు పదార్థాలు సేవించి వాహనం నడపరాదని, ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ఆటో డ్రైవర్లు పరిమిత సంఖ్యలో ప్రయాణికులను తరలించాలని, తప్పనిసరిగా యూనిఫాం ధరించాలన్నారు.రక్షణలేని రైలు మార్గాల వద్ద దాటవలసి వచ్చినప్పుడు వాహనాన్ని ఆపి ఇరువైపులా గమనించి దాటాలన్నారు. ఈ సందర్భంగా రహదారి భద్రతపై అందరిచేతా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంవీఐతో పాటు ఏఎంవీఐ రాజేష్, హెచ్‌ఎం సిద్దారెడ్డి, ఉపాధ్యాయులు విశ్వనాథరెడ్డి, ముంతాజ్ అలీ, రాజశేఖర్, ఆటో యూనియన్ నాయకులు షఫీ, శివ, హసన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

అమడగూరు: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల వ్యాప్తంగా చేపట్టిన పనులు, వాటి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ మునెప్ప, తహసీల్దార్ రామనాథరెడ్డి, అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

7న ఉద్యోగ మేళా

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల ఏడో తేదీన ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ తెలిపారు. మూడు కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు బయోడేటాతోపాటు ఆధార్‌కార్డు, విద్యార్హత పత్రాలు తీసుకుని ఆ రోజు ఉదయం 9 గంటలకు పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే ఉద్యోగ మేళాకు హాజరుకావాలని సూచించారు.

అరుణాచలానికి ప్రత్యేక లగ్జరీ బస్సు

ధర్మవరం అర్బన్: మాఘ పౌర్ణమి సందర్భంగా ఈ నెల 11న అరుణాచలం గిరి ప్రదర్శనకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సర్వీసు ఏర్పాటు చేశామని ఆర్టీసీ డీఎం సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం ఆరు గంటలకు ధర్మవరం నుంచి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరి అరుణాచలం గిరి ప్రదర్శనతోపాటు కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనార్థం బస్సు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 63031 51302, 99592 25859 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

వ్యక్తి అదృశ్యం



ఈడిగ మస్తాన్

పుట్టపర్తి అర్బన్: వెంగళమ్మచెరువు గ్రామానికి చెందిన ఈడిగ మస్తాన్ అనే వ్యక్తి కనిపించడం లేదని భార్య లావణ్య మంగళవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు. 2024 నవంబర్ ఏడో తేదీన స్నేహితుడిని కలిసేందుకు కదిరికి వెళ్తున్నట్లు చెప్పి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96839 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

ఓడీచెరువు : వంట తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించి, విద్యార్థులకు వడ్డించాలని అధికారులు సూచించారు. స్థానిక కేజీబీవీని తహసీల్దార్ అనంతాచారి, ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ మంగళవారం తనిఖీ చేశారు. వంటశాల, పరిసరాలు,, వాటర్ ట్యాంకులను పరిశీలించారు. అనంతరం రికార్డులను, భోజన మెనూ పరిశీలించి, విద్యార్థులకు అందిస్తున్న ఆహారంలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఎస్ఓకు సూచించారు.

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

చెన్నేకొత్తపల్లి: ప్రతి మహిళా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఆదిశక్తి సొసైటీ సీఈఓ కవిత పేర్కొన్నారు. ప్యాదిండిలో మంగళవారం ఆదిశక్తి సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సదస్సు నిర్వహించారు. సీఈఓతో పాటు సొసైటీ అధ్యక్షురాలు అశ్వర్థమ్మ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ గౌరి, పావని, ఆదిశక్తి సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ నివారణపై అవగాహన కల్పించండి

చెన్నేకొత్తపల్లి: గ్రామాల్లో క్షయ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని శ్రీ సత్యసాయి జిల్లా క్షయ, కుష్టు నివారణాధికారి డాక్టర్ తిప్పయ్య సిబ్బందిని ఆదేశించారు. ఎన్ఎస్‌గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరిగిన ఆశా డే కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

అవగాహనతోనే క్యాన్సర్‌పై విజయం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పుట్టపర్తి సంస్కృతీ విద్యాసంస్థల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి ప్రశాంతి గ్రామంలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వరకు ప్లకార్డులు చేత పట్టుకొని ప్రదర్శనగా వెళ్లారు. క్యాన్సర్‌ను జయించాలంటే అవగాహన ముఖ్యమన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ధర్మవరం అర్బన్: క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియా సాల్మన్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవి సూచించారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా వైద్యులు, సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ. ఆస్పత్రి సూపరింటెండెంట్ మాట్లాడారు.

అక్రమార్కులపై చర్యలకు డిమాండ్

ఎన్పీకుంట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అక్రమాలకు పాల్పడిన సిబ్బందిపై చర్యలు చేపట్టాలని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ షేక్‌బాబ్జాన్ మంగళవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి రేషన్ బియ్యం, కోడిగుడ్లు అక్రమంగా తరలిస్తూ ఏజెన్సీ నిర్వాహకుడు పట్టుబడ్డారని, విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు



ఉబిచర్లలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ భారతి

నల్లచెరువు: వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక పంట దిగుబడులు సాధించాలని ఏఓ భారతి సూచించారు. మండలంలోని ఉబిచర్ల, గొర్లవాండ్లపల్లి గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న పంటను పరిశీలించిన తర్వాత ఏఓ మాట్లాడారు.

అవసరమైన మేరకే మందులు వాడాలి

నల్లమాడ: వేరుశనగ పంటకు అవసరమైన మోతాదులో మాత్రమే మందులు వాడాలని మండల వ్యవసాయాధికారి శంకర్‌నాయక్ రైతులకు సూచించారు. కురుమాల రైతు సేవ కేంద్రం పరిధిలోని మసకవంకపల్లి, మూలప్పగారిపల్లిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ముదిగుబ్బ: ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థి జింకల నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.

ఘనంగా సుబ్రహ్మణ్య షష్ఠి

రామగిరి: పేరూరు పెన్నానది సమీపంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం షష్ఠి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, హోమాలు చేపట్టారు.

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి

తలుపుల: హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారు ప్రసవించేంత వరకు ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ జిల్లా వైద్యాధికారి నాగేంద్ర నాయక్ ఏఎన్‌ఎం, సూపర్‌వైజర్లకు సూచించారు. తలుపుల పీహెచ్‌సీలో వైద్యాధికారులు అష్ఫాఫ్, అశ్రీత ఆధ్వర్యంలో ఆశా డే సందర్భంగా మంగళవారం ఏఎన్‌ఎం, ఆశాలతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి డిప్యూటీ జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ ఆస్పత్రిలో కాన్పుల సంఖ్య పెంచాలని, అనీమియా, ముక్త్ భారత్ కింద రక్తహీనత గల వారిని గుర్తించి వారికి పౌష్టికాహారం అందేలా చూడాలని సూచించారు. టీబీ యూనిట్ సూపర్‌వైజర్ శ్రీనువాసులు క్షయ వ్యాధిపై ఇంటింటి సర్వే చేసి రోగులను గుర్తించాలన్నారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి

ధర్మవరం అర్బన్: రథసప్తమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి సందర్భంగా ఉత్సవమూర్తులను ఏడు వాహనాల్లో కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. ఒకే రోజు ఏడు వాహనాల్లో లక్ష్మీచెన్నకేశవస్వామి పురవీధుల్లో ఊరేగడంతో భక్తులు అడుగడుగునా స్వామిని దర్శించుకుని పూజించారు. ఉదయం 5 నుంచి 7 గంటల వరకు సూర్యప్రభ వాహనం, 8 నుంచి 9 గంటల వరకు శేష వాహనం, 10 నుంచి 11 గంటల వరకు గరుడ వాహనం, 12 నుంచి 1గంట వరకు హనుమద్ వాహనం, 3 నుంచి 4 గంటల వరకు కల్పవృక్ష వాహనం, 5 నుంచి 6గంటల వరకు సర్వభూపాల వాహనం, 7 నుంచి 8 గంటల వరకు చంద్రప్రభ వాహనాలపై లక్ష్మీచెన్నకేశవ స్వామి పురవీధుల్లో ఊరేగడంతో స్వామికి భక్తులు హారతులు ఇచ్చారు.

- శ్రీనివాసనగర్‌లోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామిని ఉదయం సూర్యప్రభ, సాయంత్రం చంద్రప్రభ వాహనాల్లో రథసప్తమి సందర్భంగా ఊరేగించారు.

గ్రామ సేవే రామ సేవ



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న రత్నాకర్

పుట్టపర్తి టౌన్: గ్రామ సేవే రామ సేవ అని సత్యసాయిబాబా ఉపదేశించి సేవారతిని చాటిచెప్పారని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ పేర్కొన్నారు. కొత్తచెరువు మండలం మరకుంటపల్లిలో ఏర్పాటు చేసిన సత్యసాయి వాటర్ ప్లాంట్‌ను మంగళవారం రత్నాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'అందరినీ ప్రేమించు, అందరికీ సేవ చేయి' అనే సత్యసాయి సందేశంతో ప్రేరణపొందిన భక్తులు మరకుంటపల్లిలో 1,500 కుటుంబాలకు తాగు నీరు అందించేందుకు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారన్నారు. ప్లాంట్ కోసం ఓ ముస్లిం సామాజిక వర్గం వ్యక్తి స్థలం ఉచితంగా ఇచ్చి ఉదారత చాటుకున్నారన్నారు.